# 'ఏందిమావా ఇది!'

"పూలు బాగున్నాయ్ ఎంతేంటి?"


"నాలుగు రూపాయలు"

"ఏంది నాలుగు రూపాయలా ఈ కాసిన్ని పూలు?"

"అంతేనా? ఆ రెండో ప్యాకెట్టు కూడా విప్ప దీసి చూడు...."

"ఏంది? ఆ ప్యాకెట్టుకూడా నాకేనా?"

"నీకుగాక?" అంటూ తనే ప్యాకెట్టు అందుకుని విప్పదీశాడు.



కాకాని కమల

చిన్నచిన్న ఎర్రటి పూలతో సన్నని అంచుతో వున్న చిలకపచ్చ రంగు సిల్కుకోక.

"వామ్మో ఎంత ముద్దుగుంది సీర" సీతాలు కళ్లు ఆనందంతో గిర్రున తిరిగాయ్

"నూటాభయ్యే" చెప్పాడు యాదగిరి

"అంత కరీదు పెట్టి సీరకూడా తెచ్చావా నాకు?

"ఏం తేగూడదా?" కసరుకొన్నట్టు చూశాడు.

"అబ్బే! పెండ్లానికి మగడు సీర తేవటం అబ్బురం అని గాదు"

"మరి ఏంటి?"

"నువ్వు తేవటం అబ్బురమే మావా? అర్దరేత్తిరి దాటినంకగాని ఇంటికి రానోడివి, నేను అరిసె గీ పెట్టినా నీ సంపాదనలో పది రూకలైనా నా చేతికి ఇయ్యనోడివి జన్మంకో సంకురాత్తిర న్నట్టు ఇయ్యాల ఇట్టా మారిపోయి నావంటే వింతగాదు మరి?" సీతాలు బుగ్గలు నొక్కుకుంది చిత్రంగా.

యాదగిరి సీతాలు దగ్గరకువచ్చి నడుంచుట్టూ చెయ్యి బిగించాడు.

"నువ్వంటే నాకు పేమ లేకగాదే. ఏదో కిరాయిలు తగిరి ఆటోని అట్టట్ట తిప్పిస్తా ఇంటిజాస పక్కకి మళ్ళిస్తా, నువ్వు సంపాదిస్తున్నావు గనక గాని లేకుంటే నీకు అన్నం పెట్టనా ఏంటి?"

"ఓయబ్బో?" సీతాలుకళ్ళు తిప్పుతూ సిల్కుకోక భుజాలమీద వేసుకొని గోడకున్న చిన్న అద్దంలో ముఖం చూసుకొంది సంబరంగా.

"సీర శానా బాగుంది మావా?"

"మరి కట్టుకో. సినిమాకి పోదాం"

సినిమాలంటే మహా సరదా సీతాలుకి. కాని ఎన్నిసార్లు అడిగినా ఎప్పుడూ తీసుకెళ్లడు యాదగిరి. అందుకని ఒక్కర్తే వెడుతుంది. అలాంటిది ఇవ్వాల యాదగిరి నోట్లోంచి సినిమా అన్న మాట వినగానే చిన్నపిల్లలా 'కెవ్వు' అని కేక పెడుతూ ఎగిరి గంతేసినంత పని చేసింది.

"ఓయబ్బో ఓ యబ్బో సినిమాగ్గూడానా? ఏందిమావా ఇది? ఇయ్యాళ ఏదేముడన్నా వన్ను కరుణించాడా లేక... ఏ మంతరగాడన్న నిన్ను మాయచేశాడా?"

"ఏది గాదుగాని.. తొందరగా ముస్తాబుగా! టయిమవుతోంది. టిక్కట్లుగూడ తెచ్చినా. నీ కిట్టమైన ఎన్టీఓడి ఆట...సిక్కదు-దొరకదు" అంటూ యూనిఫాం విడిచి కొక్కానికి తగిలించి, దండెంమీదవున్న తుండుగుడ్డ అందుకొని గుడిసె బయటికివచ్చాడు.

ఇంటివెనక అరటిబోదె కిందకి వచ్చి గోళంలోని చల్లటి నీళ్లు బుడుంగు బుడుంగుమని నాలుగు చెంబులు గుమ్మరించుకుని, తెల్లపాలిస్టర్ చొక్కా, నల్లగీతలున్న ప్యాంటు వేసుకొని క్రాపు దువ్వుకున్నాడు.

అప్పటికే సీతాలు కొత్తచీర కట్టుకుని సిగలో సంపెంగల దండ పెట్టుకొంది. కళ్ళనిండా కాటుకదిద్ది ముద్దుగా అలంకరించుకుని మురిపెంగ అద్దం అటుఇటు మార్చిచూసుకుంది.

కొంచెం చాయ తక్కువగావున్నా సీతాలుది కళగలముఖం. పెద్దకళ్ళు. పాతికేళ్లు దాటుతున్నా బొద్దుగా ముద్దుగా విరబూసిన పూలచెట్టులా నవనవలాడుతూ వుంటుంది.

యాదగిరి ఆటోడ్రైవర్ అయినా హంగుగా వుంటాడు. రంగు, ఒడ్డు, పొడుగుతో ఆడపిల్లలు మనసుపడేలా వుంటాడు. దానికి తోడు వుంగరాలజుత్తు.

ఆటోమీద రోజుకి వందపైగానే సంపాదిస్తాడు. అద్దెపోను బాగానే మిగులుతుంది. డబ్బు ఖర్చుపెట్టే సంగతి ఎలావున్నా పనిదగ్గర ఒళ్ళు దాచుకోడు. కానీ సంపాదనంతా తన సరదాల

కి, జల్సాలకి ఖర్చు పెట్టుకుంటాడు. ఇంట్లో ఒక్క పైసాకూడా ఇవ్వడు. సీతాలు గురించి పట్టించుకోడు.

సీతాలునాలుగిళ్ళ పాచిపని చేసుకొంటుంది. అంతో ఇంతో సంపాదించుకుంటుంది. ఆ డబ్బుతో ఇల్లు గడుపుతుంది. పనిచేసే చోట పండగ పబ్బం వస్తే పాతకోకలు జాకెట్లు ఇస్తారు.

యాదగిరి సీతాలు ఒకరంటే ఒకరు ప్రేమగానేవుంటారు. కాని ఎందుకొచ్చిన ప్రేమ? డబ్బు దగ్గరకి వచ్చేసరికి యాదగిరికి మనసు మారిపోతుంది. పెళ్ళయి ఎనిమిదేళ్ళు అవుతోంది. పిల్లా పాపలేరు. ఆ గుడిసె మాత్రం స్వంతంది. గవర్నమెంటు వాళ్ళు స్థలం వూరికే ఇచ్చారు. ఆ గుడిసె మాత్రం తన సంపాదనతో వే వేశాడు యాదగిరి. అంతే. అంతకుమించి సీతాలు చేతికి డబ్బుఇవ్వడు.

అయినా అప్పుడప్పుడు మగడితో జగడం పెట్టుకొని అతడి సంపాదనలోంచి అంతో ఇంతో గుంజుకొంటుంది సీతాలు.

అలాంటి యాదగిరి ఈరోజు ఇంటికి పెందలాడే రావటమేకాక, సిల్కుకోక, సంపంగిల పూలు, పైగా సినిమా....షికారీ...

"మనిషి మారిపోయాడా?" అన్న ఆశ కలుగుతూంది సీతాలుకి.

సీతాలుకి గర్వంగా వుంది.

ఆకుపచ్చ సిల్కు కోక సవరించుకుంటూ, తలలో సంపంగు లు రాలిపోకుండా సర్దుకుంటు ఆటోలో వచ్చి కూర్చుంది. యాదగిరి గుడిసెకు తాళం బిగించి ఆటో స్టార్ట్ చేశాడు.

* * * *

సినిమాచూసి ఇంటికి వచ్చేసరికి రాత్రి పదయ్యింది.

అన్నాలు తిన్నాక ఇల్లు సర్ది సంతోషంగా పక్కమీద వాలింది సీతాలు.

"సీతాలూ!" అంటూ యాదగిరి భుజంమీద చెయ్యి వేశాడు.

"ఏంది మావా?"అంది సీతాలు ప్రేమగా ఆ చేతిని పట్టుకుంటూ. రోజూ ఇలా పూలు, సిల్కు చీరలు తేనక్కర్లేదు. ఆటోలో ఊరంతా తిప్పనక్కర్లేదు. సినిమాలు అసలే చూపించనక్కర్లేదు కాని....చక్కగా తనతో ఇలా సఖ్యతగావుంటే ఎంత బాగుంటుంది? అనుకుంది సీతాలు.

చెడు అలవాట్లు నేర్చాడుగాని మావ మనసు మంచిదే అనుకుంది లోలోన మురిసిపోతూ.

"సీతాలూ...." చెవిదగ్గర గుసగుసగ పిలిచాడు.

"ఊ...."



**చదువు**

"మీవాడు ఎప్పుడూ చదువుతుంటాడని అన్నావు, మరి ఎలా ఫెయిలయ్యాడు".

"మా వాడు చదివేది నవలలని నాకు ఇప్పుడు తెలిసింది".

ఎ.వెంకటేష్
హిందూపురం

"మరే నేనొకటి అడుగుతాను. కాదనకూడదు."

సీతాలు చెంపమీద ఛెళ్ళున కొట్టినట్లనిపించింది.

హఠాత్తుగా యాదగిరి తనమీద కురిపించివ ప్రేమకి ఏదో అర్థం లీలగా స్ఫురించినట్లయింది.

చాలా రోజులుగా మరుగుపడిన విషయం మెరుపులా గుర్తుకువచ్చింది.... సీతాలుకి పుట్టింటివాళ్ళు నాలుగు తులాల బంగారు నానాపట్టె చేయించి పెట్టారు. ఒక్కర్తే కూతురని వెండి పాంజేబులుకూడా ఇచ్చారు.

యాదగిరి చాలా రోజులుగా అవ్వి అమ్మి, ఇంకొంచెం డబ్బు అప్పుతెచ్చి స్వంత ఆటో కొంటానని, సీతాలుని నగలు ఇమ్మని అడుగుతున్నాడు.

కాని సీతాలు ఒప్పుకోలేదు.

కాని ఇప్పుడు యాదగిరి "వ్యవహారం" చూస్తుంటే ఇంత నాటకం ఆ నగల కోసమే అనిపించింది. మల్లెపొదలు చూసి ముచ్చటపడితే నాగుపాము కాటు వేసినట్టు సీతాలు "వ్వరు"మంది. మనసు "లావా" మరిగినట్లు లోలోన కుతకుతమంది.

"ఏందే సీతాలు! ఊ... అవవ్... ఆ...అవవ్ నిద్దరపోతున్నావా?" ఆ చిరుచీకట్లో సీతాలు చెంపలు నిమిరాడు.

"లే... ఏంది చెప్పు"

"నేను ఒకటి అడుగుతా. కాదనకూడదు."

"సీతాలు చివాలున చాపమీంచి లేచి కూర్చుంది.

"ఏంది నువ్వు అడిగేది? ఆ నగలే కందా? నువ్వు పెండ్లానికి ముచ్చటగా చేపించకపోతే పోయె... మా తల్లిగారు పెట్టినవి కూడా గుంజుకుంటావా? ఇంగో చూడు. నన్ను సంపితే సంపు. కాని నేను మాత్తరం ఆటినియ్యను." సీతాలు గొంతు నిక్కచ్చిగా తెగ్గోసి చెప్పినట్లు వుంది.

ఖంగారు పడుతున్నట్లు తల అడ్డంగా వూపాడు

"అబ్బో నీ నగలు కాదు. అసలు ఇప్పుడే కాదు. ఇంగెప్పుడు నా జీవితంలో వాటి వూసెత్తను. సరేనా! కావాలంటే పెమాణం సేస్తాను. నాకు నువ్వంటే ఎంత పాసమో నీకు తెలియదే సీతాలు" దిగాలుపడ్డట్టు దీనంగా చూశాడు.

సీతాలు దిమ్మెరపోయింది.

కళ్ళు పత్తికాయల్లా చేస్తూ బుగ్గలు నొక్కుకుంది.

"ఏంది? నువ్వు అడిగేటేదినా నగలు కాదా?"

"యాదగిరి తల అడ్డంగా వూపాడు.

"కాదు"

"మరి?" కళ్ళు ముడిచింది.

గూట్లో మినుకుతున్న కిరసనాయిల్ బుడ్డి కాంతి తన ముఖంమీద పడకుండా చాటు చేసుకున్నాడు యాదగిరి.

"సీతాలూ! నువ్వంటే నాకు పేమ లేకకాదే. కాని మనకి పెండ్లయి ఎనిమిదేళ్ళుకావస్తాంది. కాని ఇంతవరకు పిల్లలు లేకపోయె. అందుకే... మ... మళ్ళి...పె... పెళ్ళి చేసుకుందామనుకుంటున్నానే...."

"ఆ...!?" వెయ్యి తుపాకులు ఒక్కసారిగా గుండెల్లో పేలినట్లు దిమ్మెరపోయింది సీతాలు. కళ్ళు తేలబడ్డాయి

"అవునే సీతాలు. శానా రోజులుగ నాకా పిల్లతో పరిచయంగూడా వుంది. అవ్వవరం గుట్టమీద పెండ్లిగూడా సేసుకున్నాం. దానికిప్పుడు నాల్గవనెల. నీళ్ళోసుకుంది. రెండు కాపురాలు కట్టంగావుంది. డబ్బుకి ఇబ్బడి ముబ్బడి. అందుకే నువ్వు ఒప్పుకుంటే దాన్నికూడా ఈడికి తెస్తా. ఇది స్వంత గుడిసె. ఆయిగా ఇద్దరూ జతగా వుండచ్చు. బుడ్డోడు దానికి పుట్టినా నీకు మాత్తరం గాకుండా పోతాడా? నువ్వు సూడలేదుగాని...నీసెల్లి... అదే ఆ పిల్ల శానా మంచిదే... నువ్వు ఒప్పుకుంటే..."

అంతే

నెత్తిమీదదబదబపిడుగులుపడుతున్నట్లు అదిరిపడింది సీతాలు. వేలకింద భూమి జారిపోతున్నట్లు నిలువెల్లా కదిలిపోయింది.

కళ్ళనిండా నీళ్ళు నిండి జలజలా చెంపలమీద జారిపోతుంటే, తన భుజాలమీదున్న పెనిమిటి చేతుల్ని విస్సురుగా తోసేస్తూ—

"ఏంది మావా ఇది? ఇంత అన్యాయం... ఏందిది? ఏంది మావ?" అంటు గొల్లుగొల్లుమంది.